ఈనాటి
PRGI-NO-APTEL/25/A2739

# తెలుగోడు

EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com

సంపుటి-1 | సంచిక - 182 | బుధవారం 1 ఏప్రిల్ 2026 | పేజీలు - 6 | వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati






# రాష్ట్ర వ్యాప్తంగా సంజీవని

- 56 లక్షల మందికి వైద్య పరీక్షల టార్గెట్...
- ప్రజల్లోకి ప్రజాప్రతినిధులు, అధికారులు...
- ప్రతి నెల గ్రామసభలు, హెల్త్ క్యాంపులు...
- 48 గంటల్లో వాట్సప్ ద్వారా రిపోర్టులు...
- 904 మొబైల్ మెడికల్ యూనిట్ల ఏర్పాటు...
- యూనివర్సల్ హెల్త్ పాలసీకి రూపకల్పన..
- సిజేరియన్లపై నియంత్రణ... సీఎం ..

**అమరావతి (తెలుగోడు), మార్చి 31 :**

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ దిశగా సంజీవని ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు చర్యలు చేపట్టింది. నారా చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ ఏప్రిల్ నెల నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వైద్యాధికారులు ప్రజల్లోకి వెళ్లి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతీ నెల నాలుగో శనివారం స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్మెంట్ పేరుతో గ్రామసభలు, హెల్త్ క్యాంపులు నిర్వహించాలని నిర్ణయించారు. చిత్తూరు జిల్లా కుప్పం, నారావారిపల్లెలో విజయవంతమైన సంజీవని ప్రాజెక్టును జూలై నాటికి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించారు. వచ్చే ఏడాదిలోగా 56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించే లక్ష్యాన్ని నిర్దేశించారు. పరీక్షల ఫలితాలను 48 గంటల్లో వాట్సప్ ద్వారా నేరుగా అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం కోసం 904 మొబైల్ మెడికల్ 2లో

## హర్మూజ్‌పై ఇరాన్ పట్టుబిగింపు

**హర్మూజ్ పై నుంచే వెళ్లే నౌకలకు టోల్ వసూల్..**

**ఒక్కో ట్యాంకర్‌పై గరిష్ఠంగా రూ.18.90 కోట్ల టోల్**



**టెహ్రాన్ (తెలుగోడు), మార్చి 31 :**

చమురు రవాణాలో ప్రపంచానికి అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిపై ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మార్గంలో ప్రయాణించే నౌకలపై టోల్ వసూలు చేయడానికి 2లో

## ఒంటిమిట్టలో వైభవంగా బ్రహ్మోత్సవాలు



**అమరావతి (తెలుగోడు), మార్చి 31 :**

ఒంటిమిట్టలోని ప్రసిద్ధ కోదండరామ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఏప్రిల్ 2లో

## ఇరాన్‌పై అణు దాడికి సిద్ధమవుతున్న అమెరికా?



**ఐరాస అనుమతి... ఆరోపణలతో అంతర్జాతీయ కలకలం..**

**కీలక ప్రతినిధి రాజీనామాపై అనుమానాలు..**

**వాషింగ్టన్(తెలుగోడు), మార్చి 31 :**

ఇరాన్‌పై ఇజ్రాయెల్‌తో కలిసి ప్రారంభమైన యుద్ధం రెండో నెలలోకి ప్రవేశించడంతో పరిస్థితులు మరింత ఉత్కంఠభరితంగా మారుతున్నాయి. ఈ క్రమంలో అమెరికా తదుపరి చర్యలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా అణ్వాయుధ (మిగతా 2లో)

## ఇంటి నిర్మాణం ఇక భారమే..!



**ధరల పెంపుకు రంగం సిద్ధం..**

**సిమెంట్ బస్తాపై భారీ పెంపు..**

**స్టీల్ ధరలూ అదే దారిలో..**

**అమరావతి(తెలుగోడు), మార్చి 31 :**

ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి చేదు వార్త. నిర్మాణ రంగ సామాగ్రి ధరలు భారీగా పెరగనున్నాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ప్రభావం ఇప్పుడు దేశీయ నిర్మాణ రంగాన్ని తాకబోతోంది. సిమెంట్, స్టీల్ ధరలను పెంచేందుకు కంపెనీలు సిద్ధమయ్యాయి. కొత్త ఆర్థిక సంవత్సరం ఆరంభంలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ నిర్ణయం సామాన్యులపై అదనపు భారం మోపనుంది. మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం ఏపీ, తెలంగాణలో సిమెంట్ బస్తా ధర కనీసం రూ.50 వరకు పెరగనుంది. ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో రూ.280 నుంచి రూ.320 మధ్య ఉన్న ధరలు పెంపు తర్వాత రూ.320 నుంచి రూ.370 వరకు చేరనున్నాయి. ఈ పెరుగుదల వచ్చే వారం నుంచే అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. సిమెంట్ తయారీలో ఉపయోగించే ఇంధన వ్యయాలు పెరగడం ప్రధాన కారణంగా కంపెనీలు చెబుతున్నాయి. పెట్రోలియం కోక్ ధరలు 130 డాలర్ల 2లో

## గురజాల బాధితులకు జగన్ భరోసా

- టీడీపీ గూండాల దాడులపై ఆవేదన వ్యక్తం చేసిన నేతలు..
- మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ..
- పోలీసుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు...



**తాడేపల్లి (తెలుగోడు), మార్చి 31 :**

తమపై జరిగిన హత్యాయత్నానికి సంబంధించి గురజాల నియోజకవర్గానికి చెందిన స్థానిక నేతలు వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి వివరించారు. టీడీపీ గూండాలు చేసిన దాడుల వివరాలను ఆయనకు తెలియజేశారు. 2లో

## తుంగభద్రకు భారీగేట్లు

**కర్నూలు, అనంతపురం జిల్లాలకు లాభం..**

**ఇప్పటికే 18 గేట్లు అమరిక పూర్తి..**

**మొత్తం 33 గేట్ల అమరికకు కార్యాచరణ..**



**బళ్లారి (తెలుగోడు), మార్చి 31 :**

తుంగభద్ర డ్యామ్‌లో నూతన గేట్ల అమరిక పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు మంగళవారం డ్యామ్‌ను పరిశీలించారు. అక్కడి నుంచే ముఖ్యమంత్రికి ఫోన్ చేసి పనుల పురోగతిని వివరించారు. గేట్ల బిగింపు ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందనే అంశంపై ముఖ్యమంత్రి ప్రశ్నించగా, ఏప్రిల్ నెలాఖరుకల్లా పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవతో కర్ణాటక ప్రభుత్వం కూడా పనులను వేగవంతం చేసినట్లు మంత్రి వివరించారు. గేట్ల బిగింపు పూర్తైతే కర్నూలు, అనంతపురం జిల్లాలకు భారీగా మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంపై మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. డ్యామ్ గేట్ కొట్టుకుపోయిన సందర్భం గుర్తుచేసుకుంటూ మంత్రి భావోద్వేగానికి లోనయ్యారు. రైతుల ప్రయోజనాలు కాపాడాలని ముఖ్యమంత్రి ఆదేశించిన వెంటనే చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. పాత గేట్లు పూర్తిగా తుప్పుపట్టి, చేత్తో తాకినా 2లో

## చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పేలుడు



**నలుగురు పోలీసులకు గాయాలు**

**బాణాసంచా బాధితులకు మంత్రి కొల్లు పరామర్శ...**

**అమరావతి (తెలుగోడు), మార్చి 31 :**

కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురు పోలీసులకు తీవ్రగాయాలయ్యాయి. మందు గుండు సామగ్రిని పోలీసులు బయట నుంచి తీసుకొచ్చి పీఎస్‌లో పరిశీలిస్తుండగా ఈ ఘటన చోటుచేసున్నట్లు సమాచారం. గాయపడిన వారిలో ఎస్సైతో పాటు పోలీసు వాహన డ్రైవర్ దుర్గాంజనేయులు, ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరిని వెంటనే స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పేలుడు ధాటికి పీఎస్‌లోని ఫర్నిచర్, బయట నిలిపి ఉంచిన వాహనాలు దెబ్బతిన్నాయి. చల్లపల్లి సీఐ కేఎస్ రావు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. పేలుడుకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. పీఎస్‌లో పేలుడు ఘటనపై రాష్ట్ర హోంమంత్రి అనిత స్పందించారు. జిల్లా ఎస్పీతో ఆమె మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గాయాలపాలైన పోలీసులకు మెరుగైన వైద్యం అందించాలని అనిత ఆదేశించారు. ఈ నేపథ్యంలో చికిత్స పొందుతున్న ప్రమాద బాధితులను మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శించారు. ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాలవడం పట్ల మంత్రి విచారం వ్యక్తం చేశారు. మంగళగిరి ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని డాక్టర్లకు సూచించారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అండగా (మిగతా 2లో)

## 31వ రోజుకు చేరుకున్న ఇరాన్ యుద్ధం

**సెకనుకు సుమారు 9.8 లక్షలు ఖర్చు చేస్తున్న అమెరికా**



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), మార్చి 31 :**

ఇరాన్‌పై అమెరికా భీకరంగా దాడి చేస్తూ.. విధ్వంసకర పేలుడు పదార్థాలు, క్షిపణులను ఆ దేశం వినియోగిస్తున్నది. చాలా ఖరీదైన ఆ ఆయుధాల వల్ల.. అమెరికా అనూహ్య రీతిలో యుద్ధం కోసం ఖర్చు చేస్తున్నది. ఇరాన్ వార్ కోసం అమెరికా ఖర్చు చేస్తున్న (మిగతా 2లో)

## కేరళంలో రాహుల్ ఉధృత ప్రచారం

**ఎల్‌డీఎఫ్‌తో బిజెపి కుమ్మక్కు..**

**అందుకే శబరిమల ఘటనపై మాట్లాడడం లేదు.. రాహుల్ ...**



**తిరువనంతపురం(తెలుగోడు),మార్చి 31 :**

కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్ ప్రచారం ఉధృతం చేశారు. వరుసగా రెండోరోజు ఆయన వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. అయితే అధికార అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్, బీజేపీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టిందని ఆరోపించారు. అందువల్లే ఈ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ గెలవాలని మోదీ కోరుకుంటున్నారని అన్నారు. బీజేపీతో కూడిన ఎల్డీఎఫ్‌కు, కాంగ్రెస్ 2లో

## బిజెపిలో చేరిన టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్

**మంత్రులు కిరణ్ రిజిజు,ముందార్ సమక్షంలో చేరిక**



**న్యూఢిల్లీ (తెలుగోడు), మార్చి 31 :**

టెన్నిస్ దిగ్గజ క్రీడాకారుడు, 18 గ్రాండ్ స్లామ్ టైటిల్స్ విజేత లియాండర్ పేస్ భారతీయ జనతా పార్టీలో మంగళవారంనాడు చేరారు. కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, సుకాంత మజుందార్ సమక్షంలో పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన కాషాయ కండువా కప్పుకున్నారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో లియాండర్ పేస్ పోటీ చేసే అవకాశం ఉంది. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు రెండు విడతల్లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి. పార్టీలో చేరే అవకాశం ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు 2లో

## డ్రైవర్ల రక్షణకు ఆధునిక సాంకేతికత



**డ్రైవర్లపై ప్రత్యక్ష పర్యవేక్షణ ప్రారంభం..**

**డ్యాష్‌క్యామ్‌లతో నిరంతర రికార్డింగ్..**

**అనుచిత చర్యలపై వెంటనే అప్రమత్తం..**

**వాహనాల వేగంపై కఠిన నిఘా... మంత్రి మండిపల్లి....**

**అమరావతి(తెలుగోడు), మార్చి 31 :**

రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయడానికి ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, బస్సు డ్రైవర్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించే విధానాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు. వాహనాల్లో ఏర్పాటు చేసిన డ్యాష్‌క్యామ్‌ల ద్వారా డ్రైవర్ ప్రవర్తనతో పాటు వాహనం ముందు దృశ్యాలు నిరంతరం రికార్డ్ అవుతున్నాయని చెప్పారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, ధూమపానం వంటి అనుచిత చర్యలు గుర్తించిన వెంటనే అలర్ట్‌లు వస్తాయని, వాటి ఆధారంగా కంట్రోల్ రూమ్ నుంచి డ్రైవర్లను తక్షణమే హెచ్చరిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా వాహనాల వేగాన్ని కూడా ఈ వ్యవస్థ ద్వారా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ డేటాను ఎనిమిది రోజుల పాటు భద్రపరుస్తున్నట్లు చెప్పారు. ఇటీవల బస్సు యజమానులతో జరిగిన సమావేశంలో ఈ వ్యవస్థ అమలుకు వారు పూర్తి సహకారం అందించడానికి అంగీకరించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కొంతమంది బస్సుల్లో ఈ సిస్టమ్ అమలులో ఉందని, రాబోయే 15 నుంచి 30 రోజుల్లో అన్ని బస్సులకు విస్తరించే లక్ష్యంతో చర్యలు 2లో

## ఇరాన్‌పై అమెరికా భీకర దాడులు

**ఆయుధ నిల్వల డిపోపై దాడి**



**అమరావతి(తెలుగోడు), మార్చి 31 :**

ఇరాన్ అణు కేంద్రక నగరం ఇస్ఫహాన్‌పై అమెరికా భీకర దాడులు చేసింది. ఆయుధ నిల్వలు ఉన్న ఓ డిపోపై బంకర్ బస్టర్లతో విరుచుకుపడింది. రెండు వేల పౌండ్ల బంకర్ బస్టర్లతో దాడులు చేయడంతో అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. ఈ దాడికి సంబంధించిన వీడియోను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్‌లో పంచుకున్నారు. అయితే దాడికి సంబంధించి ఆయన ఎలాంటి వివరణా ఇవ్వలేదు. ఇస్ఫహాన్‌లో ఇరాన్ ఆయుధ నిల్వలు ఉన్న ఓ డిపోపై అమెరికా-ఇజ్రాయెల్ (మిగతా 2లో)

# రాష్ట్ర వ్యాప్తంగా సంజీవని



(మొదటి పేజి (తరువాయి)

యూనిట్లను ఏర్పాటు చేసి రూ.162 కోట్లు ఖర్చు చేయడానికి ఆమోదం తెలిపారు.ఇప్పటివరకు 3.14 లక్షల మంది సంజీవని డిజిటల్ నర్వ్ సెంటర్ డేటాబేస్‌లో నమోదు కాగా, ప్రతి వ్యక్తికి సంబంధించిన హెల్త్ రికార్డులు ఎప్పటికప్పుడు అప్డేట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో వైద్య ఖర్చులు తగ్గించే దిశగా ప్రివెంటివ్ హెల్త్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. యోగా, పోషకాహారం, ధ్యానం, ప్రాణాయామం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు.మాతృత్వం, శక్తి, నైపుణ్యం, క్షేమం, సంజీవని అనే ఐదు ప్రధాన స్తంభాలతో త్వరలో రాష్ట్రానికి ఆరోగ్య నిర్వహణ విధానం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా యూనివర్సల్ హెల్త్ పాలసీ అమలుపై కూడా సమీక్ష నిర్వహించారు. ఈ పాలసీలో భాగస్వామ్యం కావడానికి ఇన్సూరెన్స్ సంస్థలు ఆసక్తి చూపుతున్నట్లు అధికారులు తెలిపారు.పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణంపై చర్చిస్తూ వైద్యారోగ్య శాఖలో ఖాళీలు లేకుండా చూడాలని, అవసరమైన చోట వెంటనే భర్తీ చేయాలని ఆదేశించారు. గర్భిణీలకు వైద్యుల సూచన మేరకే సిజేరియన్ ఆపరేషన్లు చేయాలని, సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. 20 శాతానికి మించి సిజేరియన్లు జరిగితే ఆడిట్ చేయాలని స్పష్టం చేశారు.

# జాతీయ స్థాయిలో పంచాయతీలకు పురస్కారాలు

## అభినందనలు తెలిపిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్



**అమరావతి (తెలుగోడు), మార్చి 31 :** ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ మరోసారి జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచింది. వరుసగా రెండో ఏడాది దీనదయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ జాతీయ పురస్కారాలకు ఎంపిక కావడం రాష్ట్రానికి గర్వకారణమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు.. ఈ విజయాలు గ్రామీణాభివృద్ధి దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలకు స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించిన పంచాయతీగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలంలోని బొక్కసం పాలెం జాతీయ స్థాయిలో ప్రథమ స్థానాన్ని దక్కించుకోవడం విశేషమని పవన్ అన్నారు. అదేవిధంగా సుపరిపాలన విభాగంలో విశాఖపట్నం జిల్లా శృంగవరం గ్రామ పంచాయతీ మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమని తెలిపారు. గ్రామ స్థాయిలో పేదరిక నిర్మూలన, జీవనోపాధి మెరుగుదల అంశాల్లో వైఎస్ఆర్ కడప జిల్లా చెమ్ముళ్లపల్లి గ్రామం జాతీయ స్థాయిలో రెండో స్థానం సాధించగా, మౌలిక సదుపాయాల కల్పనలో స్వయం సమృద్ధి సాధించిన పంచాయతీల్లో ప్రకాశం జిల్లా గుండమల గ్రామ పంచాయతీ మూడో స్థానంలో నిలిచింది. ఇక, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గ పరిధిలోని కుప్పం మండలం జాతీయ స్థాయిలో మూడో అత్యుత్తమ మండలంగా ఎంపిక కావడం ప్రత్యేకంగా నిలిచింది. గత ఏడాది కూడా పంచాయతీరాజ్ శాఖ వివిధ విభాగాల్లో నాలుగు అవార్డులు గెలుచుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ విజయాలకు కారణమైన గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, అధికారులు అందరికీ పవన్ కల్యాణ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. గ్రామీణాభివృద్ధికి తమ కృషిని గుర్తించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌కు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ అవార్డులు తమపై మరింత బాధ్యతను మోపాయని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# నేడు పార్లమెంట్ ముందుకు అమరావతి బిల్లు

## ఇక శాశ్వత రాజధానిగా అమరావతి....ఇది తెలుగువారికి ఎంతో గర్వకారణం

### టిడిపి ఎంపిలు కృష్ణదేవరాయలు, కలిశెట్టి



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), మార్చి 31 :** రాష్ట్ర ప్రజలకు శాశ్వత రాజధానిగా అమరావతి ఉంటుందని లోక్‌సభలో టీడీపీ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు వెల్లడించారు. అమరావతి తీర్మానం లోక్‌సభ ఆమోదం తరవాత ఇక ప్రజల రాజధానిగా అమరావతి వెలుగొందుతుందని అన్నారు. సోమవారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. బుధవారం పార్లమెంట్‌లో అమరావతి చట్టబద్ధత కల్పించే బిల్లును ప్రవేశపెట్టనున్నారని తెలిపారు. ఈ బిల్లు ద్వారా రాజధాని రైతులకి మరింత భరోసా వస్తోందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రైతులు నమ్మకంతోనే.. రాజధానికి భూములు ఇచ్చారన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులను కేంద్రం అర్థం చేసుకుందని చెప్పారు. గత జగన్ ప్రభుత్వం రాజధానిని అడ్డుకోవాలని చూసిందని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి రాజధానికి 30 వేల ఎకరాలని.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన మాట మార్చారని గుర్తు చేశారు. వైఎస్ జగన్ ఇప్పుడు అసెంబ్లీకి వచ్చినా? రాకున్నా రాష్ట్ర ప్రజలు పట్టించుకోరని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు పేర్కొన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలకు రాజధానిపై అసలు స్పష్టత లేదని విమర్శించారు. రాజధాని అమరావతికి తాము వ్యతిరేకం కాదని వైసీపీకి చెందిన సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పిన విషయాన్ని ఎంపీ లావు గుర్తు చేశారు. వైసీపీ నేతలు ఒక్కొక్కరు ఒక్కో విధంగా రాజధానిపై మాట్లాడుతున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు రైతులకు మాట ఇచ్చారని.. ఇప్పుడు దానిని నిలబెట్టుకున్నారని వివరించారు. ఏపీ పునర్విభజన చట్టంపై తాను పార్లమెంట్‌లో ఇప్పటి వరకు 20 సార్లకు పైగా మాట్లాడానని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు గుర్తు చేశారు. లోక్ సభకు రాజధాని అమరావతి బిల్లు రాబోతుందని.. ఇది ఒక ఆంధ్రుడిగా తనకు గర్వంగా ఉందని విజయనగరం ఎంపీ కె. అప్పలనాయుడు తెలిపారు. అమరావతి రాజధానిగా ఉండాలని 30 వేల ఎకరాల భూములను రైతులు ఇచ్చారని వివరించారు. 2014లో సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు ఇస్తే రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని చెప్పారు. దేశంలో ఎక్కడ ఇలా జరగలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. భూసేకరణ చంద్రబాబు నాయుడు హయాంలోనే జరిగిందని.. రాజధాని సైతం వారి హయంలోనే గుర్తిస్తున్నారని ఎంపీ అప్పలనాయుడు వివరించారు. అమరావతి రాజధాని నిర్మాణంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో కుట్రలు చేశారని విమర్శించారు. వైసీపీ నేతలు సైతం రాజధాని నిర్మాణం జరగకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఇది చెంపపెట్టు అన్నారు. రాజధాని అమరావతిపై జగన్ తన వక్రబుద్ధి చూపించారని చెప్పారు. అమరావతి బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపిందన్నారు. ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతి రూపుదిద్దుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడి దార్శనికత అందరికీ తెలుసునన్నారు. అమరావతి కోసం ప్రాణత్యాగం చేసిన రైతులకు ఈ సందర్భంగా పాదాభివందనం చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని ఎంపి అప్పలనాయుడు చెప్పారు.

# హోర్ముజ్‌పై ఇరాన్ పట్టుబిగింపు

(మొదటి పేజి (తరువాయి)

ఆ దేశ పార్లమెంట్ భద్రతా కమిటీ ఆమోదం తెలిపింది. హర్మూజ్ మేనేజ్‌మెంట్ ప్రణాళికకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో, ఇకపై ఈ జలసంధి గుండా వెళ్లే చమురు ట్యాంకర్ల నుంచి భారీ మొత్తంలో రుసుము వసూలు చేయనున్నారు. ఒక్కో ట్యాంకర్‌పై గరిష్ఠంగా సుమారు రూ.18.90 కోట్ల వరకు టోల్ విధించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ నిర్ణయం వెనుక హర్మూజ్‌పై తమ సార్వభౌమాధికారాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్యం ఉందని ఇరాన్ అధికారిక మీడియా పేర్కొంది. కొత్త విధానంలో భాగంగా సముద్ర భద్రతను పెంచడం, నౌకాయాన నియంత్రణను కట్టుదిట్టం చేయడం, ఆర్థిక నియమావళిని అమలు చేయడం వంటి అంశాలు ఉన్నాయి. అ టోల్ వ్యవస్థను అనుసరించి ఇప్పటికే 26 నౌకలు ఈ మార్గం గుండా ప్రయాణించినట్లు తెలిపింది. ఆయా నౌకలు అవసరమైన పత్రాలు సమర్పించి అనుమతి కోడ్‌లు పొందినట్లు సమాచారం. అయితే ఈ నిర్ణయంపై అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర విమర్శలు వ్యక్తమవు తున్నాయి. దీనిని ఖండిస్తూ, హర్మూజ్ వంటి అంతర్జాతీయ జలమార్గాలపై ఏకపక్ష నియంత్రణను ప్రపంచ దేశాలు అంగీకరించబోవని హెచ్చరించింది. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్క్ రుబియో ఈ చర్యలను వ్యంగ్యంగా విమర్శిస్తూ, అంతర్జాతీయ నౌకాయాన స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలని పేర్కొన్నారు. ఇదే సమయంలో జీ7 దేశాలు కూడా ఈ నిర్ణయాన్ని తప్పుబడుతూ, సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రవాణా కొనసాగేందుకు తక్షణ చర్యలు అవసరమని సూచించాయి.

# 31వరోజుకు చేరుకున్న ఇరాన్ యుద్ధం

(మొదటి పేజి (తరువాయి)

గణాంకాలను పరిశీలిస్తే షాక్ అవ్వాల్సిందే. ఇరాన్ వార్ కోసం ప్రతి సెకనుకు అమెరికా సుమారు 9.8 లక్షలు అంటే 10వేల డాలర్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం యుద్ధం 31వ రోజుకు చేరుకున్నది. అమెరికా పన్నుదారులకు చెందిన సుమారు 2.63 లక్షల కోట్లు ఇప్పటి వరకు ఖర్చు అయినట్లు తెలుస్తోంది. స్టాక్ హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసర్చ్ ఇన్స్టిట్యూట్ పరిశోధకులు ఈ విషయాన్ని చెప్పారు. ఫిబ్రవరి 28వ తేదీన ప్రారంభమైన యుద్ధం ప్రస్తుతం భీకర స్థాయికి చేరుకున్నది. ఈ యుద్ధం కోసం ప్రతి రోజు అమెరికా ప్రభుత్వం దాదాపు 8455 కోట్లు(890 మిలియన్ల డాలర్లు) ఖర్చు చేస్తున్నది. పేలుడు పదార్థాలు, ఎయిర్ ఆపరేషన్స్, నేవీ డివి÷-లాయ్‌మెంట్, మిస్సైల్ డిఫెన్స్, ఇంటెలిజెన్స్, లాజిస్టిక్స్‌తో అన్ని ఖర్చులు లెక్కేస్తున్నారు. ఎస్‌ఐపీఆర్‌ఐ నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. మునిషన్స్, మిస్సైళ్లకు ఎక్కువ ఖర్చు అవుతోంది. ప్రతి రోజు వాటి కోసం సుమారు 3040 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అంటే మొత్తం ఖర్చులో అది 36 శాతంగా ఉంది. తోమాహాక్ క్రూయిజ్ మిస్సైళ్లు, జేడీఏఎం బాంబులు, ప్రిసిషన్ గైడెడ్ బాంబులు ఉన్నాయి. వైమానిక ఆపరేషన్స్ కోసం ప్రతి రోజు సుమారు 2327.5 కోట్లు ఖర్చు చేస్తున్నారు. రోజు వారి ఖర్చులో ఇది 27.5 శాతంగా ఉంది. నౌకాదళ ఆపరేషన్స్ కోసం ప్రతి రోజు సుమారు 1475 కోట్లు ఖర్చు చేస్తున్నారు. యుద్ధ నౌకల మోహరింపు, డెస్ట్రాయర్లు, సబ్‌మెరైన్లు ఈ జాబితాలో ఉన్నాయి. మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్స్ థాడ్, పాట్రియాట్, ఏజిష్ బీఎండీ కోసం ప్రతి రోజు సుమారు 902 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇది రోజువారీ ఖర్చులో 11 శాతంగా ఉన్నట్లు పరిశోధకులు చెబుతున్నారు. ఇంటెలిజెన్స్, సైబర్ ఆపరేషన్స్ కోసం 427 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఐఎస్ఆర్ ఎ÷-లాట్‌ఫామ్స్, శాటిలైట్ ఇమేజ్‌లు, సైబర్ ఆపరేషన్స్ దీంట్లో ఉన్నాయి. పర్సనల్, లాజిస్టిక్స్ కోసం ప్రతి రోజు 285 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇరాన్‌పై యుద్ధం ఖర్చు మితిమీరిన నేపథ్యంలో.. ఈ అంశంపై గల్ఫ్ దేశాలతో అమెరికా చర్చించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. యుద్ధ ఖర్చుల్లో గల్ఫ్ దేశాల సహాయాన్ని అమెరికా కోరే అవకాశాలు ఉన్నాయి. 1990లో జరిగిన గల్ఫ్ వార్ సమయంలో జపాన్, జర్మనీ దేశాలు అమెరికాకు సాయం చేశాయి. ప్రస్తుతం తమకు నష్ట పరిహారం చెల్లించాలని ఇరాన్ కూడా డిమాండ్ చేస్తున్నది. ఈ నేపథ్యంలో గల్ఫ్ దేశాలను అమెరికా సాయం కోరే ఛాన్సు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

# కేరళంలో రాహుల్ ఉధృత ప్రచారం

(మొదటి పేజి (తరువాయి)




సారథ్యంలోని యూడీఎఫ్‌కు మధ్యే ఎన్నికల పోరాటం జరుగుతోందన్నారు. కన్నూరులో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తున్న సీపీఎం మాజీ నేతలు వి.కున్హికృష్ణన్, టీవీ గోవిందన్‌లు కూడా రాహుల్ ప్రసంగించిన వేదికపై పాల్గొన్నారు. ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాలకు మధ్య జరుగుతున్న పోరని, తొలిసారి బీజేపీ-లెఫ్ట్ ఫ్రంట్ చేతులు కలపడం అంతా చూస్తున్నామని రాహుల్ అన్నారు. బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టడం ఇష్టంలేకనే ఆ పార్టీలోని కొందరు సీనియర్లు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని చెప్పారు. లెఫ్ట్ ఫ్రంట్ ఇంకెంతమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్‌వింగ్ పార్టీ అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఎక్కడకు వెళ్లినా ఆలయాలు, మతం గురించి మాట్లాడతారని.. కానీ ఇక్కడకు వచ్చినప్పుడు మాత్రం శబరిమల ఆలయంలో బంగారం తాపడాలు మాయం కావడంపై ఎందుకు మాట్లాడటం లేదని రాహుల్ ప్రశ్నించారు. రాష్ట్రంలో లెఫ్ట్ ఫ్రంట్ తిరిగి గెలవాలని ఆయన కోరుకుంటున్నారని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం లేదని అన్నారు. సీపీఎంను బీజేపీ కంట్రోల్ చేస్తోందని, యూడీఎఫ్‌ను మాత్రం కాదని చెప్పారు. తనకు సవాల్ విసరగలిగే సత్తా కాంగ్రెస్‌కు మాత్రమే ఉందనే విషయం మోదీకి బాగా తెలుసునని అన్నారు. మోదీని కాంగ్రెస్ ప్రతిఘటించడం అందరికీ తెలుసునని, కానీ మోదీని కేరళ సీఎం కానీ, కేరళ సీఎంను మోదీ కానీ విమర్శించడం ఎవరూ విని ఉండరని రాహుల్ అన్నారు.

# బిజెపిలో చేరిన టెన్నిస్ దిగ్గజం లియాండర్

(మొదటి పేజి (తరువాయి)

నితిన్ నబీన్‌కు ఈ సందర్భంగా లియాండర్ పేస్ కృతజ్ఞతలు తెలిపారు. ఇది టికెట్ వ్యవహారం కాదని, ఇదో బాధ్యతని చెప్పారు. 'ఖేలో ఇండియా'తో దేశానికి, యువతకు సేవచేసే అవకాశం తనకు వచ్చిందన్నారు. యువతకు ప్రధానమంత్రి ఇస్తున్న ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని అదే అకింతభావంతో యువతపై తాను దృష్టి సారిస్తానని చెప్పారు. లియాండర్ పేస్‌కు కోల్‌కతా వంటి అర్బన్ ప్రాంతాల్లో మంచి గుర్తింపు ఉండటంతో ఆయనను పశ్చిమబెంగాల్ ఎన్నికల బరిలో దింపాలని బీజేపీ ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది. పేస్‌కు ఉన్న క్లీన్ ఇమేజ్‌తో ఎగువ మధ్య తరగతి ఓటర్లు, పట్టణ ప్రాంత నియోజకవర్గాలు, క్రీడాభిమానులను మరింతగా ఆకర్షించవచ్చని బీజేపీ భావిస్తోంది. దేశంలోని ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుల్లో ఒకరైన లియండర్ పేస్.. టెన్నిస్ డబుల్స్‌లో ప్రపంచ ఖ్యాతి పొందారు. ఒలింపిక్ మెడల్ విజేత మాత్రమే కాకుండా ఏడు ఒలింపిక్స్ గేమ్స్ ఆడిన క్రెడిట్ ఆయనదే. 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలుచుకుని టెన్నిస్‌లో ఒలింపిక్ మెడల్ గెలుచుకున్న తొలి ఆసియన్‌గా గుర్తింపు పొందారు. గ్రాండ్ స్లామ్ టోర్నమెంట్లలో ఆనేక విజయాలను ఆయన సొంతం చేసుకున్నారు. ఫ్రెంచ్, యూఎస్ ఓపెన్స్‌లో మూడుసార్ల చొప్పున, ఆస్ట్రేలియా, వింబుల్డన్ టైటిల్స్‌ను ఒక్కోసారి గెలుచుకోవడమే కాకుండా మెన్స్ డబుల్స్‌లో పలు టైటిల్స్ గెలుచుకున్నారు. 10 మిక్స్‌డ్ డబుల్స్ గ్రాండ్ స్లామ్ టైటిల్స్ గెలుచుకుని టెన్నిస్ చరిత్రలోనే అత్యంత సక్సెస్‌ఫుల్ డబుల్ ప్లేయర్స్‌గా పేరు తెచ్చుకున్నారు. ఇండియాలోని ప్రముఖ టెన్నిస్ ప్లేయర్లలో ఒకరైన మహేశ్ భూపతి భాగస్వామ్యంతో అనేక విజయాలు సాధించారు పేస్. ప్రస్తుతం.. బెంగాల్ టెన్నిస్ అసోయేషన్ అధ్యక్షుడిగా లియాండర్ పేస్ ఉన్నారు.

# డ్రైవర్ల రక్షణకు ఆధునిక సాంకేతికత



(మొదటి పేజి (తరువాయి)

చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. మొత్తం 1500 బస్సుల్లో ఈ వ్యవస్థ అమలు పూర్తైన తర్వాత అధికారిక ప్రారంభోత్సవం నిర్వహిస్తామని చెప్పారు.ఒక్కో బస్సుకు ఈ సాంకేతిక వ్యవస్థ అమలుకు సుమారు 12 వేల రూపాయలు ఖర్చు అవుతుందని, నెలవారీ నిర్వహణకు సుమారు 750 రూపాయలు అవసరమవుతాయని వివరించారు. ఈ ఖర్చును బస్సు యజమానులే భరించేందుకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణలో ఇది కీలకమైన అడుగుగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. డ్రైవర్‌ల భద్రతతో పాటు ప్రయాణికుల ప్రాణాలను కాపాడటంలో ఈ విధానం ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు.

## ఇరాన్‌పై అణుదాడికి సిద్ధమవుతున్న
# అమెరికా

(మొదటి పేజి (తరువాయి)

అణ్వాయుధ వినియోగానికి సంబంధించిన వార్తలు ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయి.ఈ పరిణామాల మధ్య ఐక్యరాజ్యసమితి కూడా ఇలాంటి చర్యలకు అనుమతి ఇవ్వబోతుందనే ఆరోపణలు వినిపించడం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసింది. అంతర్జాతీయ వేదికపై ఈ అంశం తీవ్ర చర్చకు దారి తీస్తోంది.ఇదే అంశంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆ సంస్థలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఒక ప్రతినిధి తన పదవికి రాజీనామా చేశారు. ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను వివరించుతూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.సంస్థలోని కొందరు ఉన్నతాధికారులు శక్తివంతమైన వర్గాలకు అనుకూలంగా పనిచేస్తున్నారని, కీలక నిర్ణయాలు పారదర్శకంగా తీసుకోబడటం లేదని ఆయన ఆరోపించారు. ఇరాన్‌లో అణ్వాయుధ వినియోగానికి దారితీసేపరిస్థితులు సృష్టించబడుతున్నాయని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం ప్రపంచం అత్యంత ప్రమాదకర దశలో ఉందని, పరిస్థితి తీవ్రతను ప్రజలు పూర్తిగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ పరిణామాలు కొనసాగితే అంతర్జాతీయ శాంతి భద్రతలకు తీవ్రమైన ముప్పు తలెత్తే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఇంటి నిర్మాణం ఇక భారమే

(మొదటి పేజి (తరువాయి)

నుంచి 165 డాలర్లకు పెరగడం, ఇండస్ట్రియల్ డీజిల్ రేటు రూ.23.75 పెరగడం ఉత్పత్తి ఖర్చులను గణనీయంగా పెంచాయి. గత 15 రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు 39 శాతం, బొగ్గు 14 శాతం, పెట్ కోక్ 18 శాతం పెరగడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. స్టీల్ ధరలూ అదే దారిలో ఉన్నాయి. టన్నుకు సుమారు రూ.2 వేల వరకు పెరిగే అవకాశముందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతున్న ఇంధన, రవాణా ఖర్చుల ప్రభావం దేశీయ మార్కెట్‌పై పడుతోంది.ఉత్పత్తి వ్యయాలను సమతుల్యం చేసుకోవడానికి సిమెంట్ బస్తాపై కనీసం రూ.60 వరకు ధర పెంచాల్సిన అవసరం ఉందని తయారీ సంస్థలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇళ్ల నిర్మాణ వ్యయం గణనీయంగా పెరిగే అవకాశముంది. సాధారణ ప్రజల గృహ నిర్మాణ కల మరింత ఖరీదైనదిగా మారనుంది.

# ఒంటిమిట్టలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

(మొదటి పేజి (తరువాయి)

1 బుధవారం రాత్రి ఒంటిమిట్ట సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ మహోత్సవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు హాజరవుతారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సీఎం దంపతులు సమర్పించనున్నారు. కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం, పురవీధులు రంగురంగుల దీపాలు, ప్రకాశవంతమైన ప్రదర్శన బోర్డులతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు, పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. మార్చి 26న అంకురార్పణతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఏప్రిల్ 5 వరకు వైభవంగా జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శనం చేసుకుంటున్నారు. మంగళవారం ఉదయం మోహిని అలంకారంలో కోదండరాముడు భక్తులకు దర్శనమిస్తున్నాడు. ఇవాళ రాత్రి గరుడ వాహనంపై ఒంటిమిట్ట పురవీధుల్లో స్వామి వారి ఊరేగింపు నిర్వహించనున్నారు.

# తుంగభద్రకు భారీ గేట్లు

(మొదటి పేజి (తరువాయి)

విరిగే పరిస్థితిలో ఉన్నాయని తెలిపారు.రైతుల ప్రయోజనాల కోసం ఒక్క సీజన్‌లోనే 18 కొత్త గేట్లు అమర్చామని, మొత్తం 33 గేట్ల అమరిక లక్ష్యంగా పని జరుగుతోందని చెప్పారు. దేశంలోనే ఇంత పొడవైన గేట్లు కలిగిన ప్రాజెక్ట్ ఇదేనని పేర్కొన్నారు. కాలువ ఆధునీకరణపై రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జరిగాయని వెల్లడించారు.తుంగభద్ర గేట్లతో పాటు చైన్‌లను కూడా మారుస్తున్నామని, దీని వల్ల కాలువపై ఆధారపడిన రైతులకు భరోసా కలుగుతుందని మంత్రి అన్నారు. అనంతపురం జిల్లా ప్రజల రుణం తీర్చుకునే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి ఇచ్చిన దిశానిర్దేశంతోనే పనులు వేగంగా పూర్తవుతున్నాయని మంత్రి స్పష్టం చేశారు.

# గురజాల బాధితులకు జగన్ భరోసా

(మొదటి పేజి (తరువాయి)

జగన్ను కలిసిన వారిలో రామాపురం, చర్లగుడిపాడు గ్రామాల పార్టీ నేతలు ఉన్నారు.చర్లగుడిపాడులో బీసీ వర్గానికి చెందిన కాకుమాను భావనా రిషి, భువనగిరి శ్రీనివాసరావు అనే ఇద్దరు కార్యకర్తలను టీడీపీ గూండాలు హతమార్చినట్లు వారు తెలిపారు. తమ కుటుంబ సభ్యుల హత్యలతో తాము తీవ్రంగా నష్టపోయామని, జీవనం కష్టంగా మారిందని మృతుల కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి.బాధిత కుటుంబాలను వైఎస్ జగన్ ఓదార్చి, న్యాయపరమైన సహాయం అందిస్తామని, ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో గూండారాజ్యం నడుస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆయన తీవ్రంగా విమర్శించారు.

# చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో పేలుడు

(మొదటి పేజి (తరువాయి)

ఉంటుందని బాధితులకు మంత్రి హామీ ఇచ్చారు. దీపావళి సమయంలో అక్రమ వ్యాపారం చేసిన వారి వద్ద స్వాధీనం చేసుకున్న టపాసులను తరలిస్తున్న సమయంలో ప్రమాదం జరిగిందని మంత్రి తెలిపారు. ముగ్గురు కూడా వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని చెప్పారు. బాధితులకు మెరుగైన వైద్యం అందుతోందని అన్నారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మంగళవారం ఉదయం చల్లపల్లి పోలీస్ వాహనంలో పేలుడు సంభవించింది. దీపావళి సందర్భంగా సీజ్ చేసిన టపాసులను పోలీసు వాహనంలో తరలిస్తుండగా ప్రమాదం జరిగింది. వాహనంలోని టపాసులు ఒక్కసారిగా పేలడంతో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ఎస్సై సహా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

# ఇరాన్‌పై అమెరికా భీకర దాడులు

(మొదటి పేజి (తరువాయి)

దాడులు చేసినట్టు 'వాల్‌స్ట్రీట్ జర్నల్' వెల్లడించింది. ఇస్ఫహాన్‌పై వరుస దాడులు జరగడంతో ఆ ప్రాంతంలో భారీగా మంటలు చెలరేగుతున్నట్టు పేర్కొంది. అయితే ఈ దాడులపై ఇరాన్ ఇప్పటివరకు స్పందించలేదు. కాగా, ఇస్ఫహాన్‌లోని ఓ భూగర్భ కేంద్రంలో సుమారు 540 కిలోల యురేనియం నిల్వలను ఇరాన్ దాచినట్టు వార్తలు వస్తున్నాయి. ఆ యురేనియం నిల్వల లక్ష్యంగానే తాజా దాడులు జరిగినట్టు సమాచారం. కాగా, తమతో ఒప్పందానికి రాకపోతే ఇరాన్‌పై భారీగా దాడులు చేస్తామని ఇప్పటికే ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. మరోవైపు అమెరికాతో ఒప్పందానికి అంగీకరించేది లేదని ఇరాన్‌కు చెందిన పలువురు కీలక నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అమెరికా దాడులకు దిగినట్టు తెలుస్తోంది.



## నేడు జండా దిబ్బ గ్రామంలో మంత్రి ఆనం పర్యటన

**ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ..**
**టిడిపి మండల కన్వీనర్ బాణా శ్రీనివాసులు రెడ్డి..**

**సంగం (తెలుగోడు), మార్చి 31:**
మండలంలోని జెండా దెబ్బ గ్రామంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బుధవారం పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభిస్తారని పార్టీ మండల కన్వీనర్ బాణా శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేస్తారన్నారు. కోటి 51 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు సంబంధించి ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ. నాయకులు. జనసేన పార్టీ నాయకులు. భారతీయ జనతా పార్టీ నాయకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు.. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలకు ఎటువంటి ఢోకా లేకుండా గ్రామాల అభివృద్ధి కి కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేసిన దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు

## నేడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

**టిడిపి నాయకులు కంచర్ల నరేష్ నాయుడు..**
**కంచర్ల నారాయణ నాయడు..**

**సంగం (తెలుగోడు), మార్చి 31:**
మండలంలోని జెండా దిబ్బ గ్రామపంచాయతీలో బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేస్తారని టిడిపి నాయకులు కంచర్ల నరేష్ నాయుడు. కంచర్ల నారాయణ నాయడు తెలిపారు. అనంతరం గ్రామంలో కోటి 50 లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. పంచాయతీలో అసంపూర్తిగా ఉన్న విలేజ్ హెల్త్ సెంటర్ భవనాన్ని పరిశీలిస్తారన్నారు. 44.5 లక్షల జేజేఎం నిధులతో చేపట్టిన రక్షిత మంచినీటి సరఫరా పథకం భూమి పూజ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం జనసేన బిజెపి నేతలు అభిమానులు పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

## నేడు పెన్షన్లు పంపిణీ

**పుట్టపర్తి (తెలుగోడు), మార్చి 31:**
పుట్టపర్తి మున్సిపాలిటీలోనీ ఎనుములపల్లిలో ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డితో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవితమ్మ, సత్య కుమార్ ,జిల్లా టిడిపి అధ్యక్షులు మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ హాజరవుతారు. ఉదయం 10.30 గంటలకు పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలో నూతనంగా నిర్మించిన రెవెన్యూ భవన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. ఉదయం 11:30 గంటలకు నూతన టిడిపి కార్యాలయాన్ని ప్రారంభిస్తారు . 11:45 గంటలకు సత్య సాయి పుట్టపర్తి జిల్లా కలెక్టరేట్లో జరిగే జిల్లా అభివృద్ధిపై ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశానికి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవితమ్మ, సత్య కుమార్ తో పాటు హిందూపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు , రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గారితోపాటు ఎమ్మెల్సీలు , కూటమి పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ,ప్రభుత్వ అధికారులు హాజరవుతారు.



## కదిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి తనిఖీ

**శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ..**

**కదిరి (తెలుగోడు), మార్చి 31:**
కదిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్యంపై నేరుగా చికిత్స పొందుతున్న రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.



# శారీరక మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

**ఉపాధ్యాయ క్రికెట్ పోటీలు పారంభం..**
**జడ్పిటిసి ఉమేష్..**

**అగళి (తెలుగోడు), మార్చి 31:**
క్రీడలు శారీరక మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని జెడ్పిటిసి ఉమేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉపాధ్యాయ క్రికెట్ పోటీలను మంగళవారం జడ్పిటిసి ఉమేష్ ప్రారంభించారు. ఈ పోటీలలో మడకశిర నియోజకవర్గంలోని ఐదు జట్లు పాల్గొననున్నాయి. ఈ సందర్భంగా జడ్పిటిసి ఉమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు విద్యతోపాటు క్రీడలు శారీరకంగా చాలా అవసరమని, ఇలాంటి టోర్నమెంట్లు మరిన్ని నిర్వహించాలని తమ సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. తనవంతుగా జడ్పిటిసి ఉమేష్ అక్కడికక్కడే రూ. 5000 ప్రైజ్ మనీగా ప్రకటించారు. అలాగే మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని వాటర్ బాటిల్స్, కూల్ డ్రింక్స్ అందించారు. మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో రొళ్ళ టీంపై మడకశిర టీం 3 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. టోర్నమెంట్ ఆర్గనైజర్స్ ఉపాధ్యాయులు ప్రశాంత్, అనిల్, మంజునాథ్, నరసింహమూర్తి, ఏపీజీబి అగళి బ్రాంచ్ మేనేజర్ రవిచంద్ర, అగళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మస్తాన్, ఉపాధ్యాయులు రసూల్, నాగరాజు, భరత్, షబ్బీర్, నాగార్జున, జిలాని, హనుమంతరాయప్ప, శంకర నారాయణరాజును ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి టోర్నమెంట్లు నియోజకవర్గస్థాయిలో స్థానికులను కూడా కలుపుకుంటూ మరిన్ని నిర్వహించాలని జడ్పిటిసి ఉమేష్ ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయులు జడ్పిటిసి ఉమేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జెడ్పిటిసి ఉమేష్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు రసూల్

# పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయండి

**ఎంపీడీవో రామారావు..**

**అమరాపురం (తెలుగోడు), మార్చి 31:**
1వ తేదీ లబ్దిదారులకు పింఛన్లు సక్రమంగా అందించాలని ఎంపీడీవో రామారావు కోరారు. వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు, అందులకు, అందించే సామాజిక పింఛన్ అందించాలన్నారు. అమరాపురం



హాజరైన సచివాలయ సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామారావు

ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొరపాట్లకు తావు ఇవ్వకూడదని, ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లను ఇవ్వాలని, ఎవరైనా ఒకే చోట పిలిపించి ఇచ్చినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సచివాలయంలో సమస్యలపై వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని, గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని వారు తెలిపారు .ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్డిటి కోసం అసెంబ్లీలో మాట్లాడి కొండంత ధైర్యం ఇచ్చారు

**ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి అభినందనలు..**
**ఆర్డిటి ఫౌండర్ అన్నే ఫెర్రర్ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచూ ఫెర్రర్, విశాల్ ఫెర్రర్ ..**

**పుట్టపర్తి (తెలుగోడు), మార్చి 31:**
అనంతపురం ఉమ్మడి జిల్లాకు ఆర్టీసీ ద్వారా అందిస్తున్న సేవలు గొప్ప వరమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి కొనియాడారు. ఆర్ డి టి కి ఎఫ్ సి ఆర్ ఏ వచ్చిన తర్వాత మంగళవారం పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డితో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, పీవీ కేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి అనంతపురంలోని ఆర్‌డిటి కార్యాలయానికి వెళ్లి మంచు కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఏ మంజూరు అయినందుకు వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆర్డిటి ఫౌండర్ అన్నే ఫెర్రర్ ,ఆర్డిటి ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంచూ ఫెర్రర్ , మహిళా సాధికారిక డైరెక్టర్ విశాల ఫెర్రర్ కు పల్లె కుటుంబ సభ్యులు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆర్ డి టి సంస్థ ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు గొప్ప వరమన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేద కుటుంబాలకు జీవనోపాదులు గ్రామాల్లో భూగర్భ జలాల పెంపుకు గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు విద్య తోపాటు క్రీడలు, పేదలకు అందిస్తున్న వైద్యం ఎనలేనిదనీ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు ప్రత్యేకంగా కొనియాడారు.
ఈ సందర్భంగా ఆర్డిటి సంస్థ పౌండర్ అన్నే ఫెర్రర్ ,ప్రోగ్రాం డైరెక్టర్ మాంచూ ఫెర్రర్,విశాల్ ఫెర్రర్ మాట్లాడుతూ, పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ఆర్డిటి ఎదుర్కొంటున్న సమస్యను అసెంబ్లీలో తొలిసారిగా మాట్లాడిన తీరు ఎంతో అద్భుతంగా మమ్మల్ని ఆకట్టుకుందని ఆ మేలు మేము ఎన్నటికీ మర్చిపోలేము అని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అసెంబ్లీలో ఆర్డిటి సమస్య ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నారా లోకేష్ బాబు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వ పెద్దలతో కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా మాట్లాడి ఆర్ డి టి కి కేంద్రం నుంచి ఎఫ్ సి ఆర్ ఏ మంజూరయ్యేలా కృషి చేసినందుకు పల్లె కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సాయాన్ని జీవితంలో మర్చిపోలేని ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటామని తెలిపారు. మా సంస్థకు వెన్నంటి నిలిచిన కేంద్ర ప్రభుత్వ పెద్దలకు ,రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు మరియు ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ,అండగా నిలిచిన మంత్రి నారా లోకేష్ బాబుకు ,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు రాష్ట్ర మంత్రులు , అనంతపురం జిల్లా చెందిన ఎంపీలు ఎమ్మెల్యేలకు ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని ఆర్డిటి సంస్థ ప్రతినిధులు ప్రత్యేకంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. మరిముఖ్యంగా ఈ ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు ప్రజాప్రతినిధులు ఏకతాటిపై అందరూ అండగా నిలిచి ఆర్డిటి కోసం అహర్నిశలు సహాయ సహకారాలు అందించినందుకు పేరుపేరునా ప్రతి ఒక్కరికి మీ ద్వారా ఆర్ డి టి ప్రోగ్రాం డైరెక్టర్ మాంచూ ఫెర్రర్ విశాల్ ఫెర్రర్ అనే ఫెర్రర్ లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో పాటు పీవీకే కే ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు, నియోజకవర్గానికి చెందిన కూటమి పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాంచూ కుటుంబాన్ని కలిసిన పల్లె కుటుంబం



ఆర్డిటి ఫౌండర్ అన్నే ఫెర్రర్‌ను సన్మానిస్తున్న పల్లె కుటుంబం

# ఎస్కేయూ నూతన వీసీ జ్యోతి కుమార్‌కు అభినందనలు

**ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి..**
**మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ..**

**పుట్టపర్తి (తెలుగోడు), మార్చి 31:**
అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన ఎన్‌విఆర్ జ్యోతి కుమార్‌ని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, , పీవీ కేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన ఉపకులపతిగా బాధ్యతలు తీసుకున్న జ్యోతి కుమార్‌కు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ,పి వి కే కే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి లు పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానించారు. నూతన విసీగా బాధ్యతలు తీసుకున్న జ్యోతి కుమార్ కు వారు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. వీరితో పాటు పీవీ కేకే ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి,ప్రిన్సిపాల్ సుబ్బారావు లు హాజరై నూతన ఉపకుల పతికి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఎస్కేయూ నూతన వీసీ జ్యోతి కుమార్‌ను సన్మానిస్తున్న పల్లె కుటుంబం



ఏసీబీకి పట్టుబడ్డ తహసీల్దార్ శ్రీధర్

## రైతు నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ తహసీల్దార్

**గుడిబండ (తెలుగోడు), మార్చి 31:**
గుడిబండ మండల తహసిల్దార్ శ్రీధర్ పట్టదార్ పాస్ బుక్కు మంజూరు విషయంలో రైతు వద్ద లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్ రాయపురం గ్రామానికి చెందిన రైతు సాబ్జాన్‌కు సర్వే నంబర్ 273-2లో 3.33 ఎకరాలు వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమి అన్నదమ్ముల మధ్య పంపకంలో వ్యత్యాసం ఏర్పడింది. దీంతో అతను కోర్టు ను ఆశ్రయించగా కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయితే పట్టాదార్ పాస్ పుస్తకం మంజూరు కొరకు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో తహసిల్దార్ శ్రీధర్ ను విన్నవించుకోగా పాస్ బుక్ మంజూరు కోసం లక్ష రూపాయలు ఇవ్వాలని తహసిల్దార్ రైతును డిమాండ్ చేశాడు. ఈ క్రమంలో అడ్వాన్సుగా 60 వేల రూపాయలు ఇచ్చి వెంటనే పాస్ బుక్ మంజూరు చేయాలని తహసిల్దార్‌ను కోరగా మిగతా సొమ్మును ఇస్తేనే పాస్ బుక్ మంజూరు చేస్తానని తహసీల్దార్ రైతుకు చెప్పాడు. దీంతో తన దగ్గర డబ్బులు లేక ఏసీబీ అధికారులు సంప్రదించారు. ఎసిబి అధికారులు సూచించిన మేరకు 20 వేల రూపాయలను రైతు తహసిల్దార్ శ్రీధర్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. ఈ క్రమంలో అధికారులు తహసిల్దార్ ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. దాడుల్లో ఏసీబీ డి.ఎస్.పి ప్రసాద్ రెడ్డి, సీఐ హమీద్ ఖాన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ మారెమ్మ దేవికి హారతి ఉత్సవం

**అమరాపురం (తెలుగోడు), మార్చి 31:**
వలస గ్రామంలో వెలసిన శ్రీ మారెమ్మ దేవి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భక్తులు ఘనంగా హారతి నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తమ ఇంటి నుంచి హారతులను మోసుకొని గ్రామ పుర వీధుల గుండా అమ్మవారి చింత తోపు వద్దకు చేరుకున్నారు. శ్రీ మారెమ్మ దేవి అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి హారతులు ఇచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు . ఈ సందర్భంగా వలస, వీరప సముద్రం, నడులుడము గ్రామాలలో వచ్చిన భక్తాదులకు తమ ఇంటి వద్ద విందు భోజనం ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



చింతతోపు వద్ద శ్రీ మారెమ్మ దేవి

## ఇసుక క్వారీ రద్దు చేయాలి

**నారా లోకేష్‌ను కలిసిన జనసేన నేత రామ శ్రీనివాస్**

**టి సుండుపల్లె (తెలుగోడు), మార్చి 31:**
సుండుపల్లి మండలంలో ఉన్న ఇసుక క్వారీనీ రద్దు చేసి తమ ప్రాంత రైతులను కాపాడాలని విద్య శాఖ మంత్రి నారా లోకేష్‌ను అమరావతి సెక్రటేరియట్ లో మంగళవారం కలిసినట్లు జనసేన నేత రామ శ్రీనివాస్ తెలిపారు. సెక్రటేరియట్ లో సీఎం, డిప్యూటీ సీఎంలకు వినతి పత్రం రూపంలో సుండుపల్లి మండలం ఎర్రమనేనిపాలెం సమీపంలోని బహుద నదిలో ఏర్పాటుచేసిన ఇసుక క్వారీని రద్దు చేయాలని వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. అలాగే విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ను కలిసి వినతి పత్రం అందజేసి, స్థానికంగా ప్రజలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించడం జరిగిందన్నారు. వెంటనే వారిని రద్దు చేయకపోతే సాగు తాగునీటి సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందని సమస్యను వివరించడం జరిగిందన్నారు. అలాగే టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పళ్ళ శ్రీనివాస్ ను కలిసి వినతిపత్రం అందజేశానన్నారు.



మంత్రి నారా లోకేష్‌ను కలిసిన జనసేన నేత రామా శ్రీనివాస్

## తీరిన తాగునీటి సమస్య

**ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీకు ధన్యవాదాలు..**
**రాంపురం గొల్లట్టి ఉప్పల గ్రామ ప్రజలు ..**

**అగళి (తెలుగోడు), మార్చి 31:**
తాగు నీటి సమస్య తీర్చినందుకు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లకు ఉప్పల గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదములు తెలిపారు.హళ్లికెర పంచాయితీ రాంపురం గొల్లట్టి ఉప్పల గ్రామం ప్రజలు త్రాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న సమయంలో ప్రజలు కనక లక్ష్మి రాజన్న దృష్టికి తీసుకోపోవడం జరిగింది ఆయన వెంటనే స్పందించి ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ దృష్టికి తీసుకుపోవడం తో వాళ్లు వెంటనే బోరు వెయుటకు బోర్ బండి పంపించారు. బోరు వేయడంతో పుష్కలంగా మంచి నీళ్లు దొరికినాయి.దీంతో తాగునీటి సమస్య తీరింది. ఈ సమస్య తీర్చిన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ల వల్లనే తీరిందని హళ్ళికెర పంచాయితీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ వారికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.



హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామ ప్రజలు

## పదవీ విరమణ పొందిన ఏం.రాజప్పకు అభినందనలు

**శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్**



**కదిరి (తెలుగోడు), మార్చి 31:**
వృత్తినే దైవంగా భావించి మంచికి మారు పేరుగా విధి నిర్వహణను అంకిత భావంతో నిర్వర్తించి, అందిరి మన్ననలు పొంది రోడ్ల భవనాల శాఖలో విశిష్ఠ సేవలను అందించి పదవీ విరమణ పొందిన ఏం.రాజప్పని శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.



మాట్లాడుతున్న ఏపీ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఆశీర్వాదం

## ఎస్సీలకు కేటాయించిన భూ రికార్డులు ఎక్కడ..

*తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు గల్లంతు..*
*ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఆశీర్వాదం..*

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 31:**

పెద్దకడబూరులోని మండల తహసీల్దార్ కార్యాలయంలో ఎస్సీలకు ప్రభుత్వం కేటాయించిన భూములకు సంబంధించిన రికార్డులు అందుబాటులో లేవని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఆశీర్వాదం ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని హెచ్ మురవణి గ్రామంలో అసైన్‌మెంట్ కమిటీ కింద ఎస్సీలకు కేటాయించిన ప్రభుత్వ బంజరు భూముల వివరాలు, ముఖ్యంగా సర్వే నెంబర్ 750కు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసుకునేందుకు ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆశీర్వాదం, రాజేష్, జయన్న, నాగేష్, ప్రకాష్ రాజ్ ఫిబ్రవరి 9న తహసీల్దార్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. దీనికి స్పందించిన అధికారులు ఫిబ్రవరి 26న కార్యాలయంలోని రికార్డులను పరిశీలించేందుకు అనుమతి ఇచ్చారన్నారు. ఆ సమయంలో చూపించిన రికార్డులతో సంతృప్తి చెందని నాయకులు మరలా తనిఖీ చేసుకునేందుకు మరో తేదీ ఇవ్వాలని కోరగా, మార్చి 31న కార్యాలయంలోని రికార్డ్స్ రూమ్‌లో ఫైల్స్ పరిశీలించేందుకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా అసైన్‌మెంట్ కమిటీ రిజిస్టర్, అసైన్‌మెంట్ కమిటీ అప్రూవల్ పత్రాలు, అసైన్‌మెంట్ పట్టాల ఓసీ కాపీలు, ల్యాండ్ సీలింగ్‌కు సంబంధించిన రిజిస్టర్లు వంటి ముఖ్యమైన రికార్డులు కార్యాలయంలో లభించలేదని వారు తెలిపారు. మండల వ్యాప్తంగా ఎస్సీలకు ప్రభుత్వం కేటాయించిన భూములకు సంబంధించిన ఒక్క రికార్డు కూడా కనిపించలేదని, అయితే ఇతర కులాలకు సంబంధించిన భూముల రికార్డులు మాత్రం కార్యాలయంలో ఉన్నాయని ఆరోపించారు. ఈ విషయంపై తహసీల్దార్ ను ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా స్పందించారని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పెద్దకడబూరు మండలంలోని అన్ని గ్రామాల ఎస్సీలు తమకు కేటాయించిన భూములపై పూర్తి హక్కులు పొందేందుకు వెంటనే తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి రికార్డులను తనిఖీ చేసుకోవాలని ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి జయన్న మాదిగ, జిల్లా కార్యదర్శి పరిగల ప్రకాష్ రాజ్ మాదిగ, ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షుడు నాగేష్ మాదిగ, ఎమ్మిగనూరు టౌన్ అధ్యక్షుడు రంగన్న, గోనెగండ్ల మండల అధ్యక్షుడు మునెప్ప, ఎమ్మిగనూరు మండల నాయకుడు మధు తదితరులు పాల్గొన్నారు.



కర్నాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొన్న ఎక్సైజ్ పోలీసులు

## కడిదొడ్డి క్రాస్ వద్ద కర్నాటక మద్యం పట్టివేత

*బైక్‌లో తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్ .. 576 ప్యాకెట్లు స్వాధీనం*
*ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి..*

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 31:**

కోసిగి మండల పరిధిలోని కందుకూరు గ్రామం నుంచి అగసనూరు గ్రామానికి వెళ్లే రహదారిలో కడిదొడ్డి క్రాస్ వద్ద కర్నాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఈ విషయాన్ని ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి మంగళవారం వెల్లడించారు. ఆర్లబండ గ్రామానికి చెందిన ఉసేని అనే వ్యక్తి బైక్‌పై కర్నాటక రాష్ట్రానికి చెందిన మద్యం ప్యాకెట్లను అక్రమంగా తరలిస్తుండగా ఎక్సైజ్ అధికారులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 576 కర్నాటక ఒరిజినల్ చాయిస్ 90 ఎంఎల్ మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ.38,800 ఉంటుందని వెల్లడించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు సీఐ భార్గవ్ రెడ్డి వెల్లడించారు. దాడుల్లో ట్రైనీ ఎక్సైజ్ ఎస్ఐ ధనుంజయ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి బడ్జెట్ దిశానిర్దేశం

## మంత్రాలయానికి రూ.6.60 కోట్ల నిధులు కేటాయింపు ..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 31:**

జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా మంగళవారం జిల్లా స్థాయి బడ్జెట్ సమావేశం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఇన్ చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా మంత్రి టీజీ భరత్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఎ. శిరి, జాయింట్ కలెక్టర్ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి, ఆయన తనయుడు యువనేత ఎన్. రాకేష్ రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో జిల్లా అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులు అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి మంత్రాలయం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను సమావేశంలో ప్రస్తావించారు. సంవత్సరాలుగా నిలిచిపోయిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, మౌలిక సదుపాయాల కొరత వంటి విషయాలను క్షుణ్ణంగా జిల్లా ఇన్ చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధి వేగవంతం కావాలంటే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.



జిల్లా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి



జిల్లా ఇన్ చార్జ్ మంత్రి రామానాయుడుకు బొకే అందజేస్తున్న టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి

అనంతరం జిల్లా అధికారులు, బీజేపీ – జనసేన జిల్లా అధ్యక్షులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు మరియు కూటమి నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాల అమలు, భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు. జిల్లా బడ్జెట్‌లో భాగంగా మంత్రాలయం నియోజకవర్గానికి పలు ముఖ్యమైన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం విశేషంగా నిలిచింది. మంత్రాలయంలో ఆధునిక సదుపాయాలతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.5 కోట్లు, మైనార్టీ సాధికార కేంద్ర నిర్మాణానికి రూ. 80 లక్షలు, కోసిగి మండలంలో వాల్మీకి భవన్ నిర్మాణానికి రూ. 80 లక్షలు మంజూరు చేయడం ద్వారా మొత్తం రూ. 6.60 కోట్ల నిధులు నియోజకవర్గ అభివృద్ధికి కేటాయించబడినట్లు తెలిపారు. ఈ నిధుల కేటాయింపుతో మంత్రాలయం నియోజకవర్గంలో క్రీడా, సామాజిక మరియు మైనార్టీ వర్గాల అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం చూపుతున్న ప్రాధాన్యంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రాలయం నియోజకవర్గానికి నిధులు కేటాయించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తీసుకుంటున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.





జిల్లా ఇన్ చార్జ్ మంత్రి రామానాయుడుతో పలు అంశాలపై చర్చిస్తున్న రాఘవేంద్ర రెడ్డి.
జిల్లా ఇన్ చార్జ్ మంత్రి రామానాయుడుకు నియోజకవర్గ సమస్యలపై విన్నవిస్తున్న రాఘవేంద్ర రెడ్డి

## పేర్నినాని అడ్డంకులు దాటుకుని పట్టాభి స్మారక భవనానికి పునాది

*మాజీ మంత్రి దేవినేని ఉమా..*

**మచిలీపట్నం మార్చి 31 :**

పేర్ని నాని ఎన్ని అడ్డంకులు పెట్టిన పట్టాభి స్మారక భవనం నిర్మాణానికి పునాదులు పడుతున్నాయని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా యువతను నైపుణ్యాభివృద్ధిలోకి తీసుకువెళ్లే లక్ష్యంతో యూనియన్ బ్యాంక్ సహకారంతో నిర్మించనున్న స్వాతంత్ర సమరయోధులు, ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు అయిన స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనం నిర్మాణానికి మచిలీపట్నం నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ అయిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆమోదం తెలిపారని చెప్పారు. ఈ మేరకు పట్టాభి స్మారక భవనానికి పునాదులు పడుతున్నాయని వెల్లడించారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మంగళవారం మచిలీపట్నం విచ్చేసిన సందర్భంగా పట్టాభి స్మారక భవన నిర్మాణ కమిటీ ప్రధాన కార్యదర్శి, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పి. వి. ఫణి కుమార్ భవన నిర్మాణం కోసం పోరాటం చేసిన ఫైల్‌ను చూపించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా కోర్టుకు వెళ్లే దారిలో వైసీపీ భవనానికి మచిలీపట్నం నగరపాలక సంస్థలో పేర్ని నాని తన పరివారం అయిన వైసీపీ మేయర్, కార్పొరేటర్లతో కలిసి ఎన్‌ఓసీ ఇచ్చారని, అయితే ప్రజలకు ఉపయోగపడే విధంగా స్వాతంత్ర సమరయోధుడు, ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకుడు అయిన భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరిట స్మారక భవనం నిర్మించేందుకు ఎన్‌ఓసీ ఇవ్వకపోవడం దుర్మార్గమని విమర్శించారు. ప్రజలు దీనిపై ఆలోచించాలన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలసౌరి ఈ భవన నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. వైసీపీ కార్యాలయానికి కోట్లాది రూపాయల స్థలం కబ్జా చేసినట్లు, జిల్లా కోర్టు సెంటర్‌లో ఆ కార్యాలయం పక్కనే ఉన్న ఈ భవనానికి అనుమతులు ఇవ్వకుండా ఆ స్థలాన్ని కబ్జా చేయాలనే ఉద్దేశంతోనే అడ్డుకున్నారని ఆరోపించారు. పేర్ని నాని అనుచరులు ఎన్ని కుట్రలు పన్నినా ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రజలకు ఉపయోగపడే విధంగా పట్టాభి స్మారక భవనాన్ని ఏర్పాటు చేసి యువతకు వివిధ రకాల నైపుణ్య శిక్షణలు అందించే కార్యక్రమాన్ని మచిలీపట్నం నుంచే కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రారంభిస్తామని తెలిపారు.

**అమరావతి రాజధానిపై స్పష్టత**

అమరావతి రాజధాని నిర్మాణానికి జగన్మోహన్ రెడ్డి చేసిన కుట్రలను ప్రజలు మర్చిపోలేరని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమరావతి కోసం శాసనసభలో తీర్మానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. వైసీపీ నేతలు ఎన్ని ప్రయత్నాలు చేసినా అమరావతి రాజధానిని ఇక అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టాభి స్మారక భవన నిర్మాణ సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి పి. వి. ఫణి కుమార్, తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె నాని పాల్గొన్నారు.

# బీమా కింద రూ. 5 లక్షల ఆర్థిక సహాయం

## బాధిత కుటుంబానికి అండగా నిలిచిన టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డి..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 31:**

కొన్ని నెలల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందిన కోసిగి టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు జ్ఞానేష్ సోదరుడి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తరఫున ప్రమాద బీమా పథకం కింద రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పార్టీ సభ్యత్వం ఉన్న నేపథ్యంలో టీడీపీ భీమా పథకం ద్వారా ఈ సహాయం మంజూరైంది. మంత్రాలయం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు మంత్రాలయం సొసైటీ చైర్మన్ ఎన్. రామకృష్ణారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా నిలవడం తెలుగుదేశం పార్టీ సంప్రదాయమని తెలిపారు. కష్టకాలంలో కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా నిలిచి భరోసా కల్పించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాదిత కుటుంబానికి బీమా కింద రూ. 5 లక్షల చెక్కును అందజేస్తున్న టీడీపీ నాయకులు



బాదిత కుటుంబానికి బీమా కింద రూ. 5 లక్షల చెక్కును అందజేస్తున్న టీడీపీ నాయకులు





ర్యాలీ నిర్వహిస్తున్న వైకాపా నేతలు. నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

# చేనేత సహకార సంఘం సర్వ సభ్య సమావేశంలో తీవ్ర ఉత్కంఠ, ఉద్రిక్తత

## వీగిన ఆప్కోలో విలీనం తీర్మానం.. చేనేత సహకార సంఘం కార్యాలమం ముట్టడి.. వైకాపా నేతల నిరసన..

**ఎమ్మిగనూరు (తెలుగోడు), మార్చి 31:**

ఎమ్మిగనూరులో చేనేత సహకార సంఘం సర్వ సభ్య సమావేశం తీవ్ర ఉత్కంఠ, ఉద్రిక్తతల నడుమ సాగింది. సంఘం ఔట్ లెట్‌లను ఆప్కోలో విలీనం చేసేందుకు జౌళి శాఖ కమిషనర్ తీసుకున్న నిర్ణయాన్ని చేనేత కార్మికులు మూకుమ్మడిగా తిరస్కరించారు. 225 మంది సభ్యులు సమావేశానికి హాజరుకాగా 210 మంది తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ సంతకాలు చేశారు. సమావేశానికి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఎడియే నాగరాజు విలీన ఆవశ్యకతను వివరిస్తుండగా సభ్యులు అడ్డగించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఆప్కో లో విలినాన్ని ఒప్పుకోమని ఖరాఖండిగా తేల్చిచెప్పారు. దింతో ఒక్కసారిగా సమావేశంలో గందరగోళం ఏర్పడింది. సిఐ,సబ్ కలెక్టర్ మీ నిర్ణయం మేరకే జరుగుతుందని చెప్పి సభ్యులను శాంతింపజేశారు.సభ్యులు వ్యతిరేకంగా ఉన్నట్లు గ్రహించిన అధికారులు ఎన్నడూ లేని విధంగా తీర్మానం బుక్ లో తమదైన శైలిలో తీర్మానాన్ని రాసి అనుకూలమా వ్యతిరేకమా రాయాలని నిర్ణయించారు. ఒక్కొక్కరు తమ అభిప్రాయాన్ని తెలపాలని నిర్ణయించారు. చదువు రాదని చెప్పినా వినకుండా వేలిముద్రలు వేయాలంటూ హుకుం జారీచేశారు. ఎన్నడూ ఈ పరిస్థితి లేదని మూకుమ్మడిగా వ్యతిరేకించినా తమను కన్ఫ్యూజ్ చేయడానికి అధికారులు ప్రయత్నించారని సభ్యులు తెలిపారు. తీర్మానం వీగిపోయినందుకు సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

ఉదయం సమావేశం ప్రారంభం కాకముందే చేనేత సంఘం షాపులను ఆప్కోలో విలీనాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ చేనేత సహకార సంఘం కార్యాలయాన్ని మాజీ ఎంపీ బుట్టరేణుక, ఇంచార్జ్ రాజీవ్ రెడ్డి సీపీఐ, కాంగ్రెస్ కార్యకర్తలు, చేనేత కార్మికులు ముట్టడించారు.









ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎంపి బుట్టా రేణుక. భైరాయించిన రేణుక, వైకాపా నేతలు

# చేనేతల అస్థిత్వాన్ని కాపాడాలి

## వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గఇంచార్జ్ రాజీవ్ రెడ్డి నిరసన ..

**ఎమ్మిగనూరు (తెలుగోడు), మార్చి 31:**

చేనేతల అస్థిత్వాన్ని కాపాడాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గఇంచార్జ్ రాజీవ్ రెడ్డి డిమాండ్ చేశారు. సంఘం ఔట్ లెట్‌లను ఆప్కోలో విలీనం చేసేందుకు జౌళి శాఖ కమిషనర్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సమన్వయకర్త ఎర్రకోట రాజీవ్ రెడ్డి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా పక్కనపెట్టి, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే నిర్ణయాలు తీసుకుంటోందన్నారు.. ఎమ్మిగనూరు చేనేతల జీవనాధారమైన వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీలను ఆప్కోలో విలీనం చేయడం అనేది చేనేతలపై జరుగుతున్న ఘోర అన్యాయం" అని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి పై తీవ్ర విమర్శలు చేశారు. చేనేతల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే ఈ నిర్ణయాన్ని అడ్డుకోవాలిలన్నారు.. కానీ ఆయన మాత్రం కూటమి నాయకులకు మద్దతుగా నిలబడి చేనేతల భవిష్యత్తును బలి చేస్తున్నారు. ఇది పూర్తిగా కపట వైఖరి" అని విమర్శించారు. ప్రజలు ఆశించిన అభివృద్ధి ఇవ్వలేకపోయిన ఈ ప్రభుత్వం, ఇప్పుడు వారి జీవనోపాధిపై దాడి చేస్తోంది. చంద్రబాబు గారు, స్థానిక ఎమ్మెల్యే కలిసి చేనేతల అస్తిత్వాన్ని దెబ్బతీయడానికి కుట్ర పన్నుతున్నారు" అని తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.చేనేతల పితామహుడు పద్మశ్రీ డాక్టర్ మాచని సోమప్ప నిర్మించిన కోఆపరేటివ్ వ్యవస్థను బలహీనపరచడం అనేది చేనేతల గౌరవాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. "ఈ విలీనం కేవలం పరిపాలనా నిర్ణయం కాదుచేనేతలపై దాడి" అని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మిగనూరులోని స్థానిక వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, చేనేత కార్మికులు పెద్ద ఎత్తున బైఠాయించి నిరసనలు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున నినాదాలతో ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా చేనేతల అస్తిత్వాన్ని కాపాడాలి విలీనాన్ని వెంటనే రద్దు చేయాలిచంద్రబాబు ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యేమొండి వైఖరి ఖండించాలి"అంటూ నినాదాలు చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోకపోతే ఎమ్మిగనూరు నుంచే భారీ స్థాయిలో ఉద్యమాలు ప్రారంభమవుతాయి. చేనేతల హక్కుల కోసం ఏ స్థాయికైనా పోరాటం చేస్తాం" అని లిఎర్రకోట రాజీవ్ రెడ్డి గట్టిగా హెచ్చరించారు. అనంతరం చేనేతల సమస్యలను కర్నూలు జిల్లా సంయుక్త కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి, స్థానిక అధికారులకు అర్జీ సమర్పిస్తూ, ఈ విలీనాన్ని పూర్తిగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, చేనేత కార్మికులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



నిరసన తెలుపుతున్న వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గఇంచార్జ్ రాజీవ్ రెడ








నిరసన తెలుపుతున్న వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గఇంచార్జ్ రాజీవ్ రెడ

# వరుస సినిమాలతో ప్రభాస్ బిజీ





ప్రస్తుతం స్టార్ హీరోలు ఏడాదికి ఒక సినిమాని రిలీజ్ చేయడానికే భారీగా శ్రమిస్తున్న సమయంలో, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మాత్రం తన పని తీరుతో ఏకకాలంలో మూడు భారీ ప్రాజెక్టులను నిర్వహిస్తూ చిత్రపరిశ్రమలో చర్చనీయాంశంగా మారారు. ప్రస్తుతం ప్రభాస్ 'స్పిరిట్', 'ఫౌజీ', 'కల్కి 2' వంటి మూడు భారీ బ్జడెట్ చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ మూడు సినిమాలు భిన్నమైన కథాంశాలు, వేర్వేరు పాత్రలతో తెరకెక్కుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఒకేసారి షూటింగ్‌లలో పాల్గొనడం పెద్ద సవాలే. రెండు మూడు నెలలుగా 'ఫౌజీ', 'స్పిరిట్' షూటింగ్‌లలో నిరంతరం పాల్గొంటున్న ప్రభాస్, ఇప్పుడు 'కల్కి 2' షూటింగ్‌కు కూడా రెడీ అవుతున్నారు. ఇప్పటివరకు ఆయన లేకుండా తీసిన సన్నివేశాలను పూర్తి చేసిన దర్శకుడు నాగ్ అశ్విన్, ఇక నుంచి ప్రభాస్‌తో కూడిన షూటింగ్‌ను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. మూడు సినిమాలు ఒకేసారి చేయడం వల్ల ప్రభాస్ షెడ్యూల్ మరింత బిజీగా మారనుంది. రాత్రింబవళ్లు షూటింగ్‌లతో గడపాల్సి వస్తోంది. ప్రతి సినిమాలో వేర్వేరు లుక్స్, బాడీ లాంగ్వేజ్ అవసరం కావడంతో పాత్రల మధ్య తేడాను కచ్చితంగా చూపించాల్సిన బాధ్యత కూడా ఉంది. ప్రభాస్ పనితీరు ఆయన ప్రొఫెషనల్ కమిట్‌మెంట్‌ను స్పష్టంగా చూపిస్తోంది. గతంలో కూడా 'సలార్', 'కల్కి 2898', 'ఆదిపురుష్' వంటి సినిమాలను ఒకేసారి బ్యాలెన్స్ చేసిన అనుభవం ఆయనకు ఉంది. అయితే ఇప్పుడు పరిస్థితులు మరింత కఠినంగా ఉండటంతో ఆయనపై ఒత్తిడి కూడా పెరిగింది. ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో ఉన్న చాలా మంది స్టార్ హీరోలు ఒకేసారి ఒక్క ప్రాజెక్ట్‌పైనే దృష్టి సారిస్తుంటే, ప్రభాస్ మాత్రం తన పని వేగంతో అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

# విమర్శలను పట్టించుకోవడం మానేసా



తాను ఏం చేసినా కొందరు విమర్శిస్తూనే ఉన్నారని, అందుకే అలాంటివారిని పట్టించుకోవడం మానేసినట్లు నిర్మాత నిహారిక చెప్పారు. ఆమె సొంత బ్యానర్‌పై వస్తోన్న చిత్రం 'రాకాస' సంగీత్ శోభన్, నయన్ సారిక ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు మానస శర్మ దర్శకురాలు. ఈ మూవీ ఏప్రిల్ 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా టీమ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. అందులో నిహారిక మాట్లాడుతూ.. నిర్మాతగా కెరీర్ ప్రారంభించగానే ఎన్నో విమర్శలు ఎదురయ్యాయని అన్నారు. కమిటీ కుర్రోళ్లుతో 11 మంది కొత్త వాళ్లను పరిచయం చేశాను. అప్పుడు చాలామంది కామెంట్స్ చేశారు. ఎందుకు చేస్తున్నావు ఇదంతా.. తెలిసిన వాళ్లతో సినిమాలు చేయచ్చు కదా అన్నారు. ఇప్పుడు 'రాకాస' చేస్తుంటే 'కమిటీ కుర్రోళ్లు' లాంటి కథలు చేయచ్చు కదా.. ఇలాంటి వీఎఫ్ఎక్స్‌లు ఎందుకు అన్నారు. చిన్నచిన్న వాళ్లతో సినిమాలు చేయచ్చు కదా అని మరికొందరు అన్నారు. నేనేం చేసినా మాటలు అనేవాళ్లు అంటూనే ఉన్నారు. అందుకే నేను చేయాలనుకున్నది చేస్తూనే ఉంటాను. నిర్మాతగా ప్రతి సినిమా నుంచి నేర్చుకుంటూనే ఉన్నాను. కొణిదెల కుటుంబం నాకు ఎంత ముఖ్యమో నా బ్యానర్ పింక్ ఎలిఫెంట్ ఫ్యామిలీ కూడా అంతే ముఖ్యం అని నిహారిక అన్నారు.

# కథనార్‌తో మళ్లీ బలమైన పాత్రలో అనుష్క




టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి 'బాహుబలి' తర్వాత సినిమాల ఎంపికలో జాగ్రత్తగా ముందుకు సాగుతున్న సంగతి తెలిసిందే. అడపాదడపా సినిమాలు చేస్తూ వస్తున్న ఆమె ఇటీవల 'ఘాటీ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. అయితే ఇప్పుడు భారీ అంచనాల మధ్య మలయాళంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ మూవీ 'కథనార్'తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై గోకులం గోపాలన్ నిర్మాణంలో, దర్శకుడు రోజిన్ థామస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో అనుష్కతో పాటు జయసూర్య, ప్రభుదేవ , సనూప్ సన్, వినీత్, శాండీ మాస్టర్, హరీష్ ఉత్తమన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మలయాళంలో రూపొందుతున్న ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. తాజాగా విడుదలైన 'కథనార్' ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. విజువల్స్, సెట్టింగ్స్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ట్రైలర్‌లో అనుష్క కనిపించిన తీరు, ఆమె పాత్రలో ఉన్న గంభీరత, మిస్టరీ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేకంగా చెప్పాలంటే, ఈ సినిమాలో ఫాంటసీ, హారర్, థ్రిల్లర్ అంశాలను మేళవించి రూపొందించినట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు మేకర్స్ చెబుతున్నారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగాయి. 'కథనార్'తో అనుష్క మళ్లీ బలంగా కంబ్యాక్ ఇవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# రామాయణ టీజర్ 2న విడుదల




బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణ'. దాదాపు రూ.3000 కోట్ల బ్జడెట్‌తో రాబోతున్న ఈ చిత్రం దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ఈ సినిమా టీజర్‌కు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ క్లియరెన్స్ ఇచ్చింది. ఈ చిత్రం నుంచి 'రామ' పేరుతో రాబోతున్న ఈ టీజర్ విడుదలకు ముందు సెన్సార్ బోర్డు నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో ఏప్రిల్ 2న టీజర్ విడుదల చేయడానికి మార్గం సుగమమైంది. దీనితో పాటు ఈ టీజర్ నిడివికి సంబంధించిన వివరాలు కూడా వెల్లడయ్యాయి. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, 'రామ' టీజర్ రన్‌టైమ్ 2 నిమిషాల 38 సెకన్లుగా ఉంది. ఈ టీజర్‌కు సెన్సార్ బోర్డు యూనివర్సల్ రేటింగ్ ఇచ్చింది, దీంతో ఈ టీజర్‌ను అన్ని వయసుల వారు థియేటర్‌లలో వీక్షించవచ్చు. ఇప్పటివరకు చిత్రబృందం కేవలం టైటిల్ వీడియోతో పాటు 3 నిమిషాల 3 సెకన్ల నిడివి గల 'రామాయణ: ది ఇంట్రడక్షన్' అనే క్లిప్‌ను మాత్రమే పంచుకుంది. భారీ వీఎఫ్ఎక్స్ హంగులతో కూడిన ఆ వీడియోలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్, రావణుడిగా కన్నడ స్టార్ యష్ లుక్‌లకు సంబంధించిన ఫస్ట్ లుక్‌లను చూపించారు.అయితే ఇప్పుడు రాబోతున్న టీజర్ ఎలా ఉండబోతుందని అందరూ ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. ఇక ఈ దృశ్యకావ్యం 2026 నవంబర్‌లో దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# ఓటిటిలోకి రాధిక తాయ్ కిళవి మూవీ




సీనియర్ నటి రాధికా శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించి, సంచలన విజయం సాధించిన తమిళ చిత్రం 'తాయ్ కిళవి'. ఈ చిత్రం తాజాగా డిజిటల్ ప్రియులను అలరించేందుకు సిద్ధమైంది. కేవలం రూ.9 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిన్న సినిమా బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ.75 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ డేట్ ఖరారైంది. ఏప్రిల్ 10 నుంచి ఈ చిత్రం 'జియో హాట్‌స్టార్' తో పాటు సింప్లీ సౌత్ అనే ఓటీటీలో ఒకేసారి స్ట్రీమింగ్ కాబోతున్నాయి. తమిళంతో పాటు తెలుగులోనూ ఈ చిత్రం డిజిటల్ ప్రేక్షకులకు అందుబాటులోకి రాబోతుంది. శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహించిన ఈ కామెడీ డ్రామాను ప్రముఖ తమిళ హీరో శివకార్తికేయన్ తన సొంత నిర్మాణ సంస్థ 'శివకార్తికేయన్ ప్రొడక్షన్స్' పతాకంపై నిర్మించారు. 63 ఏళ్ల వయసులో రాధిక దాదాపు 5 గంటల పాటు ప్రోస్థటిక్ మేకప్ వేసుకుని మరీ పవునుత్తాయి అనే వృద్ధురాలి పాత్రలో అద్భుతమైన నటనను కనబరిచారు. ఈ సినిమా కథవిషయానికి వస్తే.. పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ కథలో పవునుత్తాయి (రాధికా శరత్‌కుమార్) ఒక కఠినమైన వడ్డీ వ్యాపారి. అయితే ఊహించని విధంగా ఆమె పక్షవాతానికి గురై మంచాన పడుతుంది. ఆమె వద్ద 160 తులాల బంగారం ఉందనే వార్త తెలుసుకున్న ఆమె ముగ్గురు కొడుకులు వేర్వేరు ప్రాంతాల నుంచి హుటాహుటిన ఊరికి చేరుకుంటారు. ఆ బంగారాన్ని దక్కించుకోవడానికి వారు చేసిన ప్రయత్నాలు, వాటి వల్ల వచ్చే కామెడీ మరియు ఎమోషన్స్‌తో ఈ సినిమా సాగుతుంది.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.